

మా ఆఫీసులో కొద్ది రోజులక్రితం విద్యుత్ గణాంక యంత్రమును (ఎలక్ట్రానిక్ కంప్యూటర్) నెలకొల్పారు. దానిని గురించి ఆఫీసులో ఒకరోజు జరిగిన సంఘటన మీకు మనవి చేస్తాను.

• • •

ఆ రోజు సాయంత్రం విద్యుత్ గణాంక యంత్రాన్ని చూడడానికి చాలామంది వచ్చారు. ఒక ఆఫీసరు దాన్ని గురించి ప్రజలకు చెప్పనారంభించాడు.

"ఫ్రెండ్స్! ఈ యంత్రం మీ రిచ్చే ఎంత పెద్ద లెక్కనయినా కొద్ది క్షణాలలో సమాధానాన్ని ఇట్టే ఇచ్చివేస్తుంది. కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగింపులు పెద్ద సంఖ్యలతో చేయవలసి వచ్చే ప్రతి ఆఫీసులో దీని ఉపయోగం అంతా ఇంతా అని చెప్పడానికి వీలులేదు. ఒక వందమంది కొన్ని రోజులలో చేయగలిగే పనిని ఈ యంత్రం కొద్ది నిమిషాలలో చేయగలదు.

ఈ యంత్రాన్ని ఆఫీసులో నెలకొల్పితే "నిరుద్యోగ సమస్య" ఎక్కువవుతుందని కొంతమంది వ్యతిరేకిస్తున్నారు. కాని, దీనివల్ల లాభాలు ఎక్కువగా రాగలవు. ప్రజల సొమ్ము తింటున్న మేము ప్రజలకు వీలైనంత ఎక్కువ లాభాలు చూపాలనే ఉద్దేశంతో ఈ యంత్రాన్ని నెలకొల్పాము. దీని విషయమై క్రింది తరగతి ఉద్యోగు లందరూ సమ్మె చేయాలని అనుకుంటున్నారు. ఇది చాలా విచారకరమైన విషయం. ఇటువంటి సమ్మెలకు మీరు ఎటువంటి సహకారం, సానుభూతి చూపవద్దని మా మనవి.

ప్రస్తుతం మీరు ఏదైనా లెక్క యివ్వదలచుకుంటే ఇవ్వండి. కొద్ది క్షణాలలో మీకు ఈ యంత్రం ద్వారా సమాధానం యివ్వించగలను."

తన లెక్చర్ పూర్తి చేసి ప్రజలందరివైపు సగర్వంగా చూశాడు ఆఫీసరు. కొంతమంది పెద్ద పెద్ద సంఖ్యలతో కూడిన కూడికలూ, గుణకారాలూ ఇచ్చారు. ఆ ఆఫీసరు ఆ యంత్రం ద్వారా ఆ ప్రశ్నలకు సెకెండ్లలో సమాధానం ఇప్పిం

---

*మొదటి బహుమతి* [రు. 50]

వి. కృష్ణమూర్తి
— బి. ఇ. (సప్లియర్) జవహర్‌లాల్
నెహ్రూ పాలిటెక్నిక్, హైదరాబాదు.

చాడు. కొద్ది సేపటికి అక్కడున్న ప్రజలు లెక్కలివ్వడానికి కూడా విసిగెత్తినట్లుంది ఒక్కొక్కరే వెళ్ళిపోయారు.

20–22 ఏళ్ళ వయస్సున్న ఒక కుర్రవాడు మాత్రం అక్కడే నిల్చుండి పోయాడు. అందరూ వెళ్ళినా అతనుండడం ఆ ఆఫీసరుకి ఆశ్చర్యం వేసింది.

"హల్లో మిస్టర్! నీ కేమన్నా అనుమానాలున్నాయా ఈ యంత్రాన్ని గురించి? అడుగు, క్షుణ్ణంగా చెప్తాను" అని ఆ ఆఫీసరు అతన్ని దగ్గరకు పిలిచాడు. ఆ కుర్రవాడు ఒక్క క్షణం తటపటాయించాడు.

"సార్. మీరు లెక్కల స్టూడెంటా?" అని ప్రశ్నించాడు.

"అబ్బే! నేను ఎకనామిక్స్‌తో ఎం. ఏ. ప్యాసయ్యాను. ఏం? ఎందుకు?" అన్నాడు ఆఫీసరు కుర్రవాని ప్రశ్నకు, ఆ యంత్రానికి సంబంధం ఏమిటో అర్థంకాక. ఆ సమాధానంతో కుర్రవాని ముఖం వికసించింది!

"సార్! నా కొక లెక్కకు సమాధానం కావాలి. చాలా తేలిక లెక్క. మీ యంత్రం ఎంత సేపట్లో సమాధానం ఇవ్వగలదు?" అని ప్రశ్నించాడు ఆ కుర్రవాడు చిలిపిగా.

"తేలిక లెక్క అంటున్నావు. అయితే ఈ యంత్రం ఒక సెకండ్‌లో సమాధానం ఇవ్వగలదు" అన్నాడా ఆఫీసరు ధీమాగా.

"నాకు "నాలుగు డివైడెడ్ బై జీరో" సమాధానం కావాలి సార్" అన్నాడు ఆ కుర్రవాడు.

ఆ ఆఫీసరు ఆఫీసు పైకప్పు ఎగిరి పోయేట్లు ఒక నవ్వు నవ్వాడు. "ఇంత చిన్న లెక్కా నీవు అడిగేది? దీనికి సమాధానం నేను ఇవ్వగలను! అఫ్ కోర్స్ నీ లెక్కకు అన్సరు 4 అనుకో! అయినా ఈ యంత్రం ద్వారానే నీకు సమాధానం ఇప్పిస్తాను చూడు" అంటూ ఆ యంత్రానికి పని కల్పించాడు.

"ఒకటి ... రెండు మూడు ... వందలు, వేలు సెకెండ్లు దాటాయి. కాని ఆ యంత్రం పని చేస్తూనే వుంది. అన్సరు పెరుగుతూనే వుంది. కాని యంత్రం ఆగడంలేదు! ఐదు, పది, పదిహేను నిమిషాలు గడిచాయి. కానీ, ఆ యంత్రం పని చేస్తూనే వుంది. అన్సరు పెరుగుతూనే వుంది.

"సార్! మీ యంత్రానికి నా లెక్క మీకు కనపడినంత "సింపిల్"గా కనపడలేదేమో! ఇంతవరకూ సమాధానం ఇవ్వలేదు. ఇంకా పని చేస్తూనే వుంది" అన్నాడు చిలిపిగా ఆ కుర్రాడు.

ఆఫీసరుకు అర్థం కాలేదు! ఒకసారి యంత్రంవైపు, మరొకసారి ఆ కుర్రవానివైపు చూసి, వెంటనే యంత్రాన్ని ఆపుచేశాడు. ఆ కుర్రవాడు యిచ్చిన లెక్కను తిరిగి ఆ యంత్రానికి కొత్త లెక్క యిచ్చినట్లు ఇచ్చాడు. కాని, ఆ యంత్రం పని చేస్తూనే వుంది.

కుర్రవాడు ఈసారి కొంచెం పెద్దగానే నవ్వాడు.

'యంత్రం చెడిపోలేదు కదా' అనే అనుమానం వచ్చింది ఆ ఆఫీసరుకు. తనకన్న పై ఆఫీసరు దగ్గరికి వెళ్ళి చెప్పాడు. ఆ పై ఆఫీసరు వచ్చాడు. ఇద్దరూ అదే లెక్కని తిరిగి ఇచ్చారు. ఫలితం శూన్యం.

ఇద్దరూ బిత్తరపోయారు. వారికన్నా ఇంకొంచెం పెద్ద ఆఫీసరు దగ్గరకెళ్ళి ఆ విషయం నివేదించారు. ఆ పెద్ద ఆఫీసరుకు ఆశ్చర్యం వేసింది. తన గదినుంచి ఆ యంత్రం దగ్గరికి వచ్చారు ముగ్గురూ. వాళ్ళ విషయం పట్టకోనట్లుగా తన పనిలో మునిగి తేలుతోంది ఆ యంత్రం. ఆ కుర్రవాడు అదే చిరునవ్వుతో వీళ్ళను చూస్తూ అక్కడే నిలబడ్డాడు.

ముగ్గురు ఆఫీసర్లు కలిసి మరలా ఆ యంత్రానికి అదే లెక్కని కొత్తగా తిరిగి యిచ్చారు. యంత్రం విసుగూ, విరామం లేకుండా ఆ లెక్కను చేస్తూ వుంది!

ఆఫీసర్లకు అదొక వింత అనిపించింది. ఎంత పెద్ద లెక్కనయినా ఇట్టే క్షణాలలో చేయగలిగే యంత్రం ఇంత చిన్న లెక్కకు సమాధానం ఇలా గంటల తరబడి చేస్తూ ఉండటం చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది.

కొద్ది సేపటికి ఒక ఆఫీసరు 'యంత్రం చెడిపోయిందేమో'నన్న అనుమానాన్ని బయటపెట్టాడు. వెంటనే ఆఫీసర్లు ముగ్గురూ సంప్రతించుకొని ఎవరికో ఫోన్ చేశారు. కొద్ది సేపట్లో ఒకతను హడావిడిగా పరిగెత్తుకు వచ్చి ఆఫీసర్లకు నమస్కరించి, యంత్రాన్ని ఆపి, అన్ని భాగాలను పరీక్ష చేశాడు. అన్నీ సరిగ్గానే వున్నాయి.

ఈ సారి ఆఫీసర్ని లెక్క యివ్వమన్నాడు. ఆఫీసరు లెక్క యిచ్చాడు. యంత్రం పనిచేయడం మొదలెట్టింది.

ఒక్కసారిగా ఆ మెకానిక్ కు ఓ ఐడియా తట్టినట్లుంది. "సార్. మీరు యిచ్చిన లెక్క ఏమిటి?" అని అడిగాడు. ఒక ఆఫీసరు చెప్పాడు లెక్క ఏమిటో. అది ఇచ్చినది ఎవరో కూడా చూపాడు.

మెకానిక్ ఆ కుర్రవాని వైపు చూసి, ఆఫీసర్లవైపు చూసి పెద్దగా నవ్వాడు. ఆ నవ్వుకు అర్థం తెలియని ఆఫీసర్లు తెల్లముఖం వేశారు.

"సార్! ఈ లెక్కకు మన యంత్రం సమాధానాన్ని ఒక్క క్షణం కాదు ఒక వందరోజులలో కూడా యివ్వలేదు. బైదిబై మీ ముగ్గురికి కూడా లెక్కల గురించి తెలియదనుకుంటాను. నాలుగు డివైడెడ్ బై జీరో అనే లెక్కకు సమాధానం అనంతం. [ఇన్ఫినిటీ] ఈ కుర్రవాడు మీకు లెక్కలలో ప్రావీణ్యం లేదని తెలిసికొని మిమ్మల్నిబాగా అల్లరి చేశాడు. ఇతన్ని అభినందించకుండా ఉండలేను. ఏం తమ్ముడూ! నా సమాధానం నీకునచ్చినట్లేనా?" అన్నాడు మెకానిక్ నవ్వుతూ.

ఆ కుర్రవాడు 'అంతే' నన్నట్లు తలాడించాడు. ఆఫీసర్లకు అప్పటికి కానీ కిటుకు అర్థంకాలేదు.

□□□